క్లుప్తంగా

ఉచిత వైద్యసేవలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా సంచార ఉచిత వైద్యసేవలు అందజేస్తున్నట్లు సొసైటీ రాష్ట్ర పరిశీలకులు సాదినేని జనార్దన్‌రావు, వైస్ చైర్మన్ ఆర్.రవీందర్‌రావు తెలిపారు. సోమవారం ఖమ్మంలోని చర్చికాం పౌండ్‌లో ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ హరినాథబాబు, నరసింహరావు, సింధుప్రియ, సంస్థ సభ్యులు సాదినేని జనార్దన్‌రావు, ఎండి.గౌస్, సాయికుమార్, ఉప్పలయ్య, సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

పువ్వాడ కృష్ణకు పరామర్శ



అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ మంత్రి, ఎంపీ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంకు చెందిన పువ్వాడ కృష్ణ సతీమణి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిన్నమ్మ పుష్పవతి అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందింది. ఈ మేరకు ఆమె మృతదేహం వద్ద పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నివాళులర్పించి అంతిమయాత్రల్లో పాల్గొన్నారు. అలాగే, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఇంకా డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మేయర్ నీరజ, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, పారా నాగేశ్వరరావు తదితరులు కూడా నివాళులర్పించారు.

సేవా కార్యక్రమాలకు కార్యాచరణ



మాట్లాడుతున్న పూర్ణచందర్ ప్రసాద్

నేలకొండపల్లి: భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సేవలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందించినట్లు సొసైటీ అధ్యక్షుడు పాలడుగు పూర్ణచందర్ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక బౌద్ధక్షేత్రం వద్ద సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం వన సమారాధన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆట, పాటలతో సందడి చేశారు. వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సొసైటీ ప్రతినిధులు తెల్లగొర్ల లింగస్వామి, వి.భాస్కర్‌రావు, లెనిన్, తిరపయ్య, గణపతిరావు, శ్రీనివాస్, జగన్‌మోహన్‌రావు, దుర్గారావు, కడియాల నరేష్ పాల్గొన్నారు.

మూడు మంత్రి పదవులతో జిల్లా అభివృద్ధి

ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మం జిల్లాకు మూడు ముఖ్యమైన మంత్రి పదవులు ఇవ్వడంతో జిల్లా సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని తెలంగాణ బీసీ జేఏసీ నాయకుడు డాక్టర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు మూడు మంత్రి పదవులు కేటాయించడంపై సీఎం రేవంత్ రెడ్డికి బీసీ జేఏసీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా చరిత్రలో ఒకేసారి మూడు మంత్రి పదవులు రావడం గర్వకారణమని, దీంతో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

రైతులను ఆదుకోవాలి

ఖమ్మంరూరల్: అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ తెలిపారు. ఆదివారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో వరి, మిర్చి, మొక్కజొన్న పంటలు అకాల వర్షానికి తీవ్ర నష్టం జరిగిందని, ఇప్పటికే రైతులు రుణమాఫీ కాక అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. మండలంలో 630 ఎకరాల్లో వరి, 340 ఎకరాల్లో మిర్చి, 15 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం జరిగినట్లు అధికారులు తేల్చారన్నారు. వి.సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	యానిమల్
వినోద	హాయ్‌నాన్న
సాయిరాం	కాలింగ్ సహస్ర
ఆదిత్య	యానిమల్
శ్రీనివాస	ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్

- ఖమ్మం గాంధీచౌక్

ఆధ్యాత్మికం.. ఆరోగ్యం

ఏటేటా పెరుగుతున్న అయ్యప్ప మాలధారుల సంఖ్య

- 41 రోజుల దీక్ష.. ఆరోగ్యకరం
- సామూహిక పూజలు సమైక్యతకు దోహదం



భజన చేస్తున్న అయ్యప్ప మాలధారులు

ఖమ్మంగాంధీచౌక్: ఆధ్యాత్మికత, ఆరోగ్యకరమైనవి అయ్యప్ప దీక్షలు. మనసు, శరీరాన్ని పవిత్రం చేసుకోవడం అయ్యప్ప పూజ ప్రత్యేకం. ఎంతో పవిత్రత, నిష్ఠతో చేసే 41 రోజుల దీక్షా కార్యక్రమం మానవుని జీవన విధానంలో మార్పు తీసుకొస్తుందని నమ్ముతారు. కేరళలోని శబరిమలై హిందువుల ప్రధాన యాత్ర స్థలాల్లో ఒకటి. అయ్యప్ప దర్శనం కోసం వెళ్లే భక్తులు 41 రోజుల పాటు దీక్ష తీసుకొని ఇరుముడి కట్టుకుంటారు. మాలధారణ చేసిన స్వాములు 41 రోజుల పాటు అత్యంత నియమనిష్ఠలతో పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

దీక్షతో ఆధ్యాత్మికత..

అయ్యప్ప దీక్షలో ఆధ్యాత్మికత రహస్యాలు అనేకం ఉన్నాయి. ఈ దీక్షకు అనేక నియమ నిబంధనలను రూపొందించారు. దీక్షలో మాలధారణ, నల్లటి వస్త్ర ధారణ, చన్నీటిస్నానం, విభూతి, చందనాలతో అలంకరించుకోవటం వంటి ఆచారాలు ఆధ్యాత్మికతకు ఉపకరిస్తాయి. ఈశ్వరుడికి అత్యంత ఇష్టమైన కార్తీక మాసం దక్షణాయనంలో ప్రారంభమయ్యే అయ్యప్ప పూజలు విష్ణువుకు ఇష్టమైన ఉత్తరాయణం మార్గశిరంతో ముగుస్తుంది. అయ్యప్ప దీక్షలో నేలపై పడుకోవటం, పాదాచారులై నడవటం, ఒంటిపూట భోజనం, బ్రహ్మచర్యం, మద్యం, మాంసాదులు, మసాలా దినుసులు వంటిని ఆహారంలో తీసుకోవడం వంటి అంశాలకు దూరంగా ఉండడం తప్పనిసరి.

ఆరోగ్య ప్రయోజనాలు అనేకం

అయ్యప్ప దీక్షలో పాటించే నియమాలు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. భక్తి భావంతో పాటు అనేక మంది ఆరోగ్య రక్షణకు ఈ దీక్షలను చేపడుతున్నారు. ఆహార అలవాట్లలో అనేక మార్పుల కోసం కూడా కొందరు ఈ దీక్ష తీసుకుంటారు. మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లు ఉన్న వారికి ఈ దీక్షలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటున్నాయి. ఆ అలవాట్లు మానటంతో పాటు, ఆరోగ్యాన్ని కూడా రక్షించుకుంటున్నారు. అయ్యప్ప దీక్షల నియమావళి పాటించటంతో అనేక రకాలుగా ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. ఉదయాన్నే నిద్ర లేవటం చైతన్యానికి ప్రతీక. సూర్యోదయానికి ముందే లేచి చన్నీటి సాన్నం చేయటం ద్వారా నాడీ వ్యవస్థ ఉత్తేజితమవుతుంది. ముఖంలో ప్రసన్నత కనిపిస్తుంది. నేలమీద పడుకోవటంతో వెన్ను నొప్పులు ఉంటే తగ్గటం, కండరాల పటిష్ఠతకు దోహదపడుతుంది. రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగుపడుతుంది. నిత్యం దీపారాధన చేయటంతో దీపం కాంతిలో మనసు తేలికపడుతుంది. సామూహికంగా కలిసి ఉండటం ద్వారా క్రమశిక్షణ అలవడుతుంది. స్నేహం, ప్రేమానురాగాలు పెరుగుతాయి. పూజలో పాల్గొనటం వలన సంఘ జీవనంలో గుర్తింపు లభిస్తుంది. ఒక్కపూట భోజనం చేయటం ద్వారా మితాహారాన్ని ప్రోత్సహించినట్లవుతుంది. శాఖాహారం తీసుకోవటం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది.

ఖమ్మం నుంచి భక్త జనం



ఇరుముడి కార్యక్రమం

ఖమ్మం నగరంలో పాటు, జిల్లా నలుమూలల అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో ఉంటారు. జిల్లాలో ప్రతి ఏటా 2 లక్షల మంది వరకు, నగరంలో 50 వేల మందికి పైగా అయ్యప్ప మాల ధరిస్తారని పూజారులు చెబుతున్నారు. నగరంలోని శ్రీనివాస నగర్‌లో ఉన్న శ్రీ శాస్తా దేవాలయంలో ప్రతి ఏటా 10 వేల మంది అయ్యప్పలు మాలధారణ చేస్తారు. శబరిమలలో ఆలయ నిర్వహణను పోలిన విధంగా శ్రీశాస్త దేవస్థానంలో కార్యక్రమాలను ఇక్కడ పూజారులు నిర్వహిస్తున్నారు. 41 రోజులు దీక్ష పూర్తి చేసుకున్న భక్తులు శబరిమలైకు రైలు మార్గంలో, బస్సుల్లో వెళ్లి మొక్కులు చెల్లించుకుంటారు. ఇప్పటికే కొందరు మండల దీక్ష పూర్తిచేసుకుని శబరి వెళ్లగా.. ఇంకొందరు జనవరిలో జ్యోతి దర్శనానికి వెళ్లేందుకు మాలధారణ చేశారు.



ఖమ్మంలోని శ్రీశాస్తా దేవస్థానం

నియమ నిష్టలు ప్రయోజనకరం



అయ్యప్పదీక్ష ఎంతో యమ నిష్ఠతో ఉంటుంది. ఆధ్యాత్మిక చింతనతో తనకు తాను మార్చుకునే విధానం ఈ మాల ధారణతో అలవడుతుంది. మనసు, ప్రశాంతత, పవిత్రంగా ఉండడమేకాక క్రమశిక్షణ అలవడుతుంది.

– గణపతి శ్రీనివాస్, మామిళ్లగూడెం, ఖమ్మం

మానవతా విలువలు పెరుగుతాయి



అయ్యప్ప మాలధారణ పవిత్రమైనది. మానవతా విలువలు పెంపొందుతాయి. నేను నాలుళ్లుగా అయ్యప్ప మాల ధరిస్తున్నా. అయ్యప్ప మాల ధరించి అనేక అంశాలు తెలుసుకున్నా. జీవితంలో అవి ఎంతో ప్రయోజనంగా ఉన్నాయి.

– పదాల శివానంద రెడ్డి, పంపింగ్‌వెల్ రోడ్, ఖమ్మం

స్నేహభావం, సమైక్యత..



అయ్యప్ప మాలధారణ మానవ జీవన ప్రమాణాలను పెంచుతుంది. మనిషిగా తన విధిని గుర్తిస్తారు. సంఘ జీవిగా ఉండడం, తోటి వారిని గౌరవిండం తెలిసొస్తుంది. పూజలు, భజనల ద్వారా స్నేహభావం, సమైక్యత అలవడుతాయి.

– టి.రవి, నాయుడుపేట, ఖమ్మం

కేఎంసీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరణ



ఫోన్ ద్వారా సిబ్బందిని ఆదేశిస్తున్న డీసీ మల్లీశ్వరి

ఖమ్మంమయూరిసెంటర్: పలు సమస్యలపై ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు పలువురు వచ్చి తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. డిప్యూటీ కమిషనర్ బి.మల్లీశ్వరి నగర ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల నుండి ఫిర్యాదులు అందుకున్న మల్లీశ్వరి వాటిని పరిశీలించి సంబంధిత విభాగాల అధికారులకు అందజేశారు. గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పలు సమస్యలపై అక్కడ నుండి సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడి వాటిని పరిష్కరించే విధంగా ఆదేశాలు ఇచ్చారు. కేఎంసీ గ్రీవెన్స్‌కు మొత్తం 19 ఫిర్యాదులు అందినట్లు ఆమె తెలిపారు.

నేడు కూనంనేని విజయోత్సవ ర్యాలీ

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి విజయం సాధించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విజయోత్సవ ర్యాలీని మంగళవారం ఖమ్మంలో నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశ్రీ విగ్రహం నుంచి ర్యాలీ ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అనంతరం ఎంబీ గార్డెన్స్‌లో అభినందన సభ జరుగుతుందని, ఈ సభలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీల నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, నాయకులు అధిక సంఖ్యలో విజయవంతం చేయాలని ప్రకటనలో కోరారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం..



మాట్లాడుతున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: ప్రతీ కాంగ్రెస్ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది వచ్చినా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అండగా ఉంటారని కాంగ్రెస్ నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొండాపురంలో పలు పార్టీల నుండి పలువురు కాంగ్రెస్ చేరారు. వారికి దయాకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరడం సంతోషకరమన్నారు.

రైతుబంధు తక్షణమే విడుదల చేయాలి

కూసుమంచి: నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వం వాగ్దానాల్లో భాగంగా రైతుబంధును తక్షణమే విడుదల చేయాలని తెలంగాణా రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కూసుమంచిలో సంఘం మండల కార్యదర్శి బిక్కసాని గంగాధర్ మాట్లాడుతూ.. రైతుబంధు పథకాన్ని పది ఎకరాల్లోపు చిన్న, సన్నకారు రైతులకు తొలుత విడుదల చేయాలన్నారు. ఈ సంవత్సరం అకాల వర్షాలు, తెగుళ్లతో వరి, పత్తి, మిర్చి పంటలు తీవ్రంగా నష్టపోయినందున రైతులు దెబ్బతిన్నారని, వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం రైతుబంధును విడుదల చేయాలని కోరారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న ఎస్సై భవాని

ఖమ్మం మామిళ్లగూడెం: బాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం త్రీటౌన్‌లోని ప్రకాశ్‌నగర్‌లోని కార్యాలయంలో నిరుపేద పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా త్రీటౌన్ ఎస్సై వి.భవాని ముఖ్య అతిథిగా పాల్గొని పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఎస్సైను ఘనంగా సత్కరించారు. ట్రస్టు చైర్మన్ బాలు, సభ్యురాలు ప్రవళిక, రామలక్ష్మమ్మ, అలేఖ్య, కాశమ్మ, సింధు, సీహెచ్ శ్రీను, మధు తదితరులు పాలొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠ



శివుడి విగ్రహం వద్ద ముదిరాజ్ నాయకులు

కామేపల్లి: పండితాపురం గ్రామంలోని శ్మశానవాటికలో శివుడు, నందీశ్వరుడి విగ్రహాలను సోమవారం ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన కొమ్ము నాగేశ్వరరావు తల్లిదండ్రులు ముత్తయ్య-భారతమ్మ జ్ఞాపకార్థం రూ.లక్షా ఖర్చు చేసి విగ్రహాలను కొనుగోలు చేసి ప్రతిష్ఠించినట్లు తెలిపారు. నాయకులు ఐతన బోయిన విఠల్‌రావు, నాగేశ్వరరావు, శివ, శీలం పుల్లయ్య, రవి, నరేష్, వెంకట్రావ్, వెంకన్న, రాంబాబు, సహదేవ్, ఉపేందర్, చిన్ననర్సయ్య, వీరబాబు, వెంకటనారాయణ, పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజ



రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంలో గురుస్వామి తాండ్ర రాంప్రసాద్ ఆధ్వర్యంలో మహా పడిపూజ, హోంగుండం పూజలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రాపర్తి రాజా ఆధ్వర్యంలో కార్తికేయన్ కన్నె స్వామితో పడిపూజ కార్యక్రమం నిర్వహించారు.

మంత్రి, ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



కామేపల్లి: మంత్రి పొంగులేటికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కామేపల్లి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే, కొత్తలింగాల, గోవింద్రాలకు చెందిన నాయకులు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి పుష్పచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ ఫత్తేమహ్మద్, ఇట్టా శ్రీను, బొడ్డు లక్ష్మీనారాయణ, తుమ్మలపల్లి వీరయ్య, తోటకూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మంత్రి సీతక్కను గరిడేపల్లి గ్రామానికి చెందిన ఆల్ ఇండియా బంజారా సేవాసంగ్ జాతీయ కోశాధికారి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ పరిశీలకులు భట్టు వెంకన్న కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



ఖమ్మంవన్‌టౌన్: మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తిలక్

ఖమ్మంవన్‌టౌన్: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులను ఖమ్మం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రం బాలగంగాధర తిలక్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అండర్-19 క్రికెట్ జట్టులో శ్రీచైతన్య విద్యార్థులు



స్టీఫెన్‌పాల్



రికేష్



రిషికేష్‌గౌడ్

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు అండర్-19 క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. కళాశాలకు చెందిన స్టీఫెన్‌పాల్, రికేష్, జి.రిషికేష్‌గౌడ్ త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ మేరకు క్రీడాకారులను శ్రీచైతన్య విద్యాసంస్థల అధిపతి ఎం.శ్రీధర్, శ్రీవిద్య, ప్రిన్సిపాల్ జోజిచాకో అభినందించారు.

పురస్కారాలు అందజేత



పురస్కారాలు అందుకుంటున్న దంపతులు

ఖమ్మంగాంధీచౌక్: వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న ఖమ్మం నగరానికి చెందిన బ్రహ్మశ్రీ దాములూరి కృష్ణ శర్మ, ఆయన సతీమని దాములూరి శివానిలకు తెలుగు వెలుగు జాతీయ పురస్కారాలు లభించాయి. నగరంలోని శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి ఆలయంలో అర్చకులుగా జాతీయ స్వచ్ఛంద సంస్థ తెలుగు సాహితీ వేదిక ఆదివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో నిర్వహించిన జాతీయ సాంస్కృతిక సంగీత సాహిత్య నృత్య సమ్మేళనంలో పురస్కారాలను అందించి, సత్కరించారు. ఈ మేరకు దాములూరి దంపతులను పలువురు అభినందించారు.

అంజమ్మకు నంది జాతీయ పురస్కారం



అంజమ్మను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఖమ్మంరూరల్: మానవ హక్కుల రక్షణ ప్రజా సమితి జిల్లా అధ్యక్షురాలు తోటకూర అంజమ్మకు తెలుగువెలుగు స్ఫూర్తి నంది జాతీయ పురస్కారాన్ని ప్రఖ్యాత నృత్య దర్శకురాలు డాక్టర్ వెంపటి శ్రావణి సోమవారం అందించారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో జరిగిన జాతీయ సాంస్కృతిక సాహిత్య నృత్య సమ్మేళనం 2023లో జరిగిన ప్రదానోత్సవంలో పురస్కారం అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ కన్వీనర్ సంగిశెట్టి రమేష్, చైర్మన్ రాజ్‌కుమార్, గాంధీ, ఆర్ఆర్.గాంధీ నాగరాజన్, ద్వారాకా తిరుమల్‌రావు, మానేపల్లి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎక్స్‌పోలతో విజ్ఞానం



ఉపాధ్యాయులు, విద్యార్థులతో డీఈఓ

రఘునాథపాలెం: విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు సైన్స్ ఎక్స్‌పోలు దోహదం చేస్తాయని డీఈఓ సోమశేఖర్‌శర్మ అన్నారు. రఘునాథపాలెంలోని వీవీసీ పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోను తిలకించిన ఆయన ఎగ్జిబిట్ల వివరాలు తెలుసుకున్నారు. ఇస్రోస్టేషన్, చంద్రయాన్ ప్రాజెక్ట్, హైడ్రో ఎలక్ట్రిసిటీ తదితర ప్రాజెక్టులు ఆకట్టుకోగా డీఈఓ మాట్లాడుతూ... ఇలాంటి ప్రదర్శనలు ఏటా నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని తెలిపారు. కరస్పాండెంట్ రేఖల భాస్కర్, రామానుజాచార్యులు, ప్రిన్సిపాల్ విద్యుల్లత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు రెజొనెన్స్ విద్యార్థి



విద్యార్థులను అభినందిస్తున్న రెజొనెన్స్ డైరెక్టర్లు

ఖమ్మం సహకారనగర్: ఇటీవల నల్గొండలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభకనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు రెజొనెన్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు ఆర్వి.నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావులు తెలిపారు. ఈ మేరకు శనివారం కళాశాలలో విద్యార్థులను అభినందించారు. అండర్-17 బాలుర విభాగంలో-58 కేజీల బాలుర విభాగంలో ప్రథమ సంవత్సరం విద్యార్థి సయ్యద్ ఆదిల్ పాషా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించి ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. అండర్-17బాలికల విభాగంలో సయ్యద్ సాలేహిన్ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిందన్నారు.

శివాలయాల్లో పూజలు

- వైభవంగా శివపార్వతుల కల్యాణం

ఖమ్మంగాంధీచౌక్/ రఘునాథపాలెం/ కామేపల్లి/ ఖమ్మం అర్బన్ : కార్తీక మాసం చివరి సోమవారం కావటంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి కార్తీక దీపాలను వెలిగించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా రాత్రి శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.



ఖమ్మంఅర్బన్: బాలాజీనగర్‌లోని రామాలయంలో త్రిశూల ఆకృతిలో దీపాలు



ఖమ్మంగాంధీచౌక్: గుంటు మల్లన్న ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు



మామిళ్లగూడెంలో శివపార్వతుల కల్యాణం



రఘునాథపాలెం: పువ్వాడనగర్‌లో..

ఎంపీ వద్దిరాజు పూజలు



ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పలు దేవాలయాల్లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఖమ్మం ఎన్ఎస్పీ క్యాంపులోని సీతారామాంజనేయ స్వామి ఆలయం, కాల్వొడ్డులో ఉన్న ఉన్న గుంట మల్లేశ్వర స్వాముల ఆలయాలను సందర్శించి మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, గణేష్‌తో కలిసి పూజలు నిర్వహించారు. కాగా, మల్లేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం కోసం ఎంపీ రూ.లక్ష విరాళం అందజేశారు. అలాగే, ముస్తఫానగర్‌లో అయ్యప్ప మాలధారుల కోసం శ్రీదివ్య మణికంఠ అన్నదాన సేవాసమితి ఆధ్వర్యాన ఏటా అన్నదానం చేస్తుండగా ఎంపీ రవిచంద్ర సోమవారం హాజరై రూ.లక్ష విరాళం అందించారు. అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు చిర్రా రవి, పుట్ట మల్లికార్జున్, మాచర్ల నరేష్, శేఖర్, రవితేజ, చరణ్, గురుబ్రహ్మం, సతీష్ పాల్గొన్నారు.